సాక్షి
కుమురం భీం
మంగళవారం । 28 । జనవరి । 2025





**జంగుబాయికి మొక్కు**
కెరమెరి మండలంలోని మహరాజ్‌గూడ సమీపంలో ఈనెల 1 నుంచి ప్రారంభమైన జంగుబాయి ఉత్సవాలు మంగళవారం ముగియనున్నాయి.
8లో▸



**‘ఉపాధి’లో పొలంబాట**
ఉపాధిహామీ పథకంలో రైతుల పొలాల్లోని బాటలను అభివృద్ధి చేసేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది.
8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.2 /18.4

**వాతావరణం**
చాలా వరకు ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. పగలు ఎండగా ఉంటుంది. తెల్లవారుజామున చలి ప్రభావం ఉంటుంది.

## న్యూస్‌రీల్

### సమస్యలు పరిష్కరించాలని వినతి



డీఆర్‌డీఏకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి డీఆర్‌డీఏ దత్తారాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏలకు శ్రీనిధి ఇన్సెంటివ్స్ అలవెన్సులు ఇప్పించాలని, ఆన్‌లైన పనిభారం తగ్గించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం నిర్ణయించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్దు, నాయకులు ధన్‌రాజ్, సంతోష్, అంకన్న, వనిత, రవీందర్, భరత్, శ్రీధర్, కళ్యాణి, రమేశ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల హక్కుల సాధనకు నిరంతర పోరాటం




జెండా ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రావు

**రెబ్బెన:** సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం టీబీజీకేఎస్ నిరంతరం పోరాడుతుందని యూనియన్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంతో పాటు గోలేటి సీహెచ్‌పీ, ఖైరిగూడ ఓసీపీలలో టీబీజీకేఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2003, జనవరి 27న పురుడు పోసుకుందని, కేసీఆర్ నాయకత్వంలోఎన్నో హక్కులను సాధించి పెట్టిందన్నారు. సింగరేణి కార్మికులకు నిత్యం అందుబాటులో ఉండి న్యాయమైన హక్కులకోసం పోరాడుతామన్నారు. 22 ఏళ్లగా యూనియన్ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మారిన వెంకటేశ్వర్లు, సమ్మయ్య, మహేందర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

### 29న విద్యుత్ కార్యాచరణపై సమావేశం

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో వేసవి కాలానికి సంబంధించి విద్యుత్ కార్యాచరణ ప్రణాళికపై ఈ నెల 29న సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆసిఫాబాద్ సర్కిల్ నోడల్ అధికారి వాసుదేవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో నిరాటంకంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పురోగతిలో ఉన్న పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశం చేయనున్నట్లు ఆయన వివరించారు.

### ‘గిరిజనులకు అన్యాయం జరిగితే సహించం’



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజన రైతులు

**ఆసిఫాబాద్:** కుమురంభీం వారసులైన గిరిజనులకు అన్యాయం జరిగితే సహించేది లేదని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం భూనిర్వాసిత రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిర్యాణి మండలం మంగి శివారు ఎర్రబండ గ్రామానికి చెందిన గిరిజన రైతులు 40 ఏళ్లుగా కాస్తు, కబ్జాలో ఉన్న భూములను సాగు చేస్తున్నారని, రెవెన్యూ అధికారులు వాటికి పట్టాలు మంజూరు చేశారన్నారు. సదరు పట్టాలను తహసీల్దార్ రద్దు చేస్తామనడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారన్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతుల భూములు ఆన్‌లైన్ నుంచి తొలగించారన్నారు. కార్యక్రమంలో నిర్వాసిత రైతులు కనక జను, మర్సుకోల బొజ్జిరావు, ఆత్రం ఆత్మారావు, కొర్వెత దేవ్, సోయం చిత్రూ, మాన్కు తదితరులు పాల్గొన్నారు.

# లెక్క తేలింది

- జిల్లాలో సాగుకు యోగ్యంగా లేని భూములు 1,800 ఎకరాలు
- 4,42,374 ఎకరాలకు అందనున్న రైతుభరోసా
- ఈనెలాఖరు లోగా రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం



నంబాల శివారులో యాసంగి నాట్లు వేస్తున్న కూలీలు

**రెబ్బెన:** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీల్లో రైతుభరోసా ఒకటి. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పంటల సాగులో రైతులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా రైతుభరోసా అమలుకు విధి విధినాలను కూడా అమలు చేయక పోవడంతో రైతులతో పాటు ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పెంచాయి. సంక్రాంతి నుంచే రైతుభరోసా అమలు చేస్తామని తొలుత ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల మంజూరు కార్యక్రమాలన్నీ ఒకేసారి అందించాలని నిర్ణయించి గ్రామాల్లో సర్వేలు నిర్వహించింది. ఈనెల 26న మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి నాలుగు పథకాలను ప్రారంభించింది. అయితే గత ప్రభుత్వం ధరణిలో ఉన్న భూములన్నింటికీ రైతుబంధు అమలు చేయగా సాగుకు యోగ్యంగా లేని భూముల యాజమానులు సైతం రైతుబంధుతో లబ్ధిపొందారు. తాజా ప్రభుత్వం కేవలం సాగుకు యోగ్యంగా ఉన్న భూములకు మాత్రమే రైతుభరోసా అందించాలని నిర్ణయించడంతో పాటు క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే నిర్వహించి సాగుకు యోగ్యంగా లేని భూముల లెక్క తేల్చారు.

**1.38 లక్షల మందికి రైతు భరోసా**

జిల్లాలో సుమారు 1.40 లక్షల మంది రైతుల ఉన్నట్లు సమాచారం. తాజా లెక్కల ప్రకారం ఈసారి 1.38 లక్షల మంది రైతులకు రైతు భరోసా అందనుంది. అయితే గత ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా జిల్లాలో 1,37,808 మంది రైతులకు గానూ 4,44,174 ఎకరాలకు పెట్టుబడి సాయం కింద రూ.222,08,70,972 అందించింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం సాగుకు యోగ్యంగా లేని భూములకు రైతుభరోసా అందించేందుకు నిరాకరించడంతో ఈసారి సుమారు 4,42,374 ఎకరాలకు మాత్రమే రైతుభరోసా అందనుంది. అయినప్పటికీ ఈసారి జిల్లా రైతులకు అందించే పెట్టుబడి పెరగనుంది. గత ప్రభుత్వం ఎకరానికి సీజన్‌కు రూ.5వేలు మాత్రమే చెల్లించగా ప్రస్తుత ప్రభుత్వం ఎకరానికి రూ.6వేలు చెల్లిస్తామని ప్రకటించింది. దీంతో ఈసారి రైతుభరోసా కింద ఈ సీజన్‌కు జిల్లా రైతులకు రూ.265,42,44,000 పెట్టుబడి సాయంగా అందనుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 1వ తేదీ వరకు కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టాపాస్ పుస్తకం పొందిన రైతులకు సైతం రైతుభరోసా అందిస్తామని ప్రకటించింది. ఈ తరహా రైతుల నుంచి రైతుభరోసా కోసం దరఖాస్తులు సైతం స్వీకరిస్తోంది. క్లస్టర్ల వారీగా వ్యవసాయశాఖ అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండడంతో జిల్లాలో రైతుభరోసా అర్హుల సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉంది.

**నెలాఖరులోగా రైతుల ఖాతాల్లో నగదు..**

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచే రైతు భరోసా పథకం కింద సాగు భూములకు పెట్టుబడిసాయం అందిస్తామని ప్రకటించినప్పటికీ తొలుత మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలోని రైతులకు మాత్రమే రైతుభరోసాను అందించింది. మిగిలిన రైతులకు ఈనెలాఖరులోగా రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గతంలో ముందుగా తక్కువ విస్తీర్ణం ఉన్న భూములకు, ఆతర్వాత ఎక్కువ విస్తీర్ణం ఉన్న భూములకు పెట్టుబడి సాయం అందించేవారు. కానీ ఈసారి అలాంటివేం లేకుండా భూముల విస్తీర్ణంతో సంబంధం లేకుండా అందరికీ ఒకేసారి అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు ముందు ఎకరానికి రూ.15వేలు అందిస్తామని ప్రకటించి ఇప్పుడు కేవలం రూ.12వేలు మాత్రమే చెల్లిస్తుండటంతో రైతులు ఒకింత నిరాశకు గురవుతున్నారు.

### 1,800 ఎకరాలకు రైతుభరోసా కట్

జిల్లాలోని 15 మండలాల పరిధిలో సుమారు 4.40 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. అయితే కొంతమంది రైతుల భూముల్లో ప్రభుత్వ అనుమతులు లేని వెంచర్లు వేసినప్పటికీ ధరణిలో మాత్రం వ్యవసాయ భూమిగానే ఉండి పోయింది. దీంతో పాటు ప్రాజెక్టులో ముంపునకు గురై అవార్డు అయిన భూములు సైతం రెవెన్యూ రికార్డుల్లో వ్యవసాయ భూములుగానే ఉండిపోయాయి. రోడ్లు, ఇతర అవసరాల కోసం సేకరించిన భూములు సైతం యధావిధిగా వ్యవసాయ భూములుగానే రెవెన్యూ రికార్డుల్లో ఉండిపోయాయి. అయినప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అలాంటి భూములకు సైతం రైతుబంధు అందించింది. అయితే తెలంగాణలో మొదటిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతులకు రైతుభరోసా ద్వారా పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించింది. అయితే రైతుబంధు అమలులో ఉన్న లోపాలను నివారించి కేవలం సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతుభరోసా పెట్టుబడిసాయాన్ని అందిస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా ఈనెల 18 నుంచి 20 వరకు క్షేత్రస్థాయిలో రెవెన్యూ, వ్యవసాయశాఖ, పంచాయతీరాజ్ అధికారులు సర్వేలు చేపట్టారు. సాగులో ఉన్న వ్యవసాయ భూములు, ఇతర అవసరాల కోసం మళ్లించిన భూముల వివరాలను సేకరించారు. జిల్లా వ్యాప్తంగా సాగుకు యోగ్యంగా లేని భూములు సుమారు 1,800 ఎకరాల వరకు ఉన్నాయని అధికారులు నిర్ధారించారు. అయితే సర్వేకు అతితక్కువ సమయం మాత్రమే ఉండడంతో అధికారులు సమగ్రమైన విచారణ చేపట్టలేకపోయారు. మరింత సమయం ఇస్తే సాగుకు యోగ్యంగా లేని భూములు పెరగడమో.. తగ్గడమో జరిగే అవకాశం లేకపోలేదని అధికారులు భావిస్తున్నారు.

### సర్వే ద్వారా గుర్తించాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి గ్రామాల్లో సర్వే నిర్వహించి జిల్లాలో సాగుకు యోగ్యంగా లేని భూములు 1,800 ఎకరాలు ఉన్నట్లు గుర్తించాం. రైతుభరోసాకు అర్హత ఉన్న భూములకు పెట్టుబడిసాయం అందించేందేలా ప్రభుత్వానికి నివేదికలు అందించాం. ఈ నెల 26న మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి రైతుభరోసా అందజేశాం.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

# ఓవర్ టు కేస్లాపూర్

- నేడే నాగోబాకు మహాపూజ
- రాత్రి మరూ కానున్న జాతర
- ఇప్పటికే చేరుకున్న మెస్రం వంశీయులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 31న ఆలయ ఆవరణలో దర్బార్
- హాజరుకానున్న రాష్ట్ర మంత్రులు



మర్రిచెట్టు వద్ద గుడారాలు వేసుకుని బస చేసిన మెస్రం వంశీయులు

**ఇంద్రవెల్లి:** నాగోబా.. ఆదివాసీల ఆరాధ్యదైవం. రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ జాతర నేటి నుంచి షురూ కానుంది. మెస్రం వంశీయుల మహాపూజతో ఈ ఘట్టం ప్రారంభం కానుంది. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పుష్యమాస అమావాస్య పురస్కరించుకుని మంగళవారం రాత్రి 10:30 గంటలకు పవిత్ర గంగాజలంతో నాగోబాను అభిషేకించనున్నారు. అనంతరం మొదలయ్యే జాతర ఫిబ్రవరి 4వరకు కొనసాగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. మహాపూజకు జిల్లా కలెక్టర్, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర అధికారులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. అలాగే ఈ నెల 31న నిర్వహించనున్న దర్బార్ కార్యక్రమానికి ఇద్దరు రాష్ట్ర మంత్రులు విచ్చేయనున్నారు. ఆలయ సమీపంలో హెలీప్యాడ్‌ను సైతం సిద్ధం చేశారు. మరోవైపు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**93 మంది పేర్లతో తూమ్ పూజలు**

పవిత్ర గంగాజలంతో మర్రి చెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు మూడు రోజుల పాటు సంప్రదాయ నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం వేకువజాము వరకు మెస్రం వంశంలో మరణించిన 93 మంది పెద్దల పేర్లతో తూమ్ పూజలు నిర్వహించారు.

**మహాపూజ ఇలా..**

సంప్రదాయ పూజలు ముగించాక మెస్రం వంశీయులు హస్తిన మడుగు నుంచి తీసుకువచ్చిన పవిత్ర గంగాజలంతో నాగోబాను అభిషేకిస్తారు. రాత్రి 10:30 గంటలకు మహాపూజ చేస్తారు. ఈతంతులో మెస్రం వంశ పెద్దలకు తప్ప ఇతరులకు అనుమతి లేదు. అనంతరం హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులకు హారతి ఇచ్చి జాతర ప్రారంభమైనట్లు ప్రకటిస్తారు.

**కొత్త కోడళ్ల బేటింగ్**

రాత్రి ఒంటి గంట తరువాత మెస్రం వంశ కొత్త కోడళ్లతో బేటింగ్ ఉంటుంది. బుధవారం తెల్లవారుజమున వరకు కొనసాగుతుంది.

**దర్బార్‌కు మంత్రులు సీతక్క, సురేఖ హాజరు**

నాగోబా జాతరలో భాగంగా నిర్వహించే దర్బార్‌కు రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లను మెస్రం వంశీయులతో కలిసి సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీ సోయం బాపూరావ్, ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావ్, దేవదాయ శాఖ ఈవో రాజమౌళి తదితరులు ఉన్నారు.

**నేటి సంప్రదాయ పూజలివే..**

ఇప్పటికే కేస్లాపూర్‌లోని మర్రి చెట్టు వద్దకు చేరుకున్న మెస్రం వంశీయులు మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం నాగోబా మురాడి నుంచి వంశ పెద్దలు నాగోబా ప్రతిమలు, పూజ సామగ్రితో శోభాయాత్రగా ఆలయానికి చేరుకుంటారు. 22 కితలకు చెందిన వంశ మహిళలు కుండల్లో కోనేరు నుంచి నీటిని తీసుకువస్తారు. ఆలయం పక్కనే ఉన్న పాత పుట్టను వంశ అల్లుళ్లు తొలగిస్తారు. ఆడపడుచులు కొత్త పుట్టలు తయారు చేస్తారు. అనంతరం ఆ మట్టితో ఉండలు చేసి సతీదేవత ఆలయంలో బౌలను తీర్చిదిద్దుతారు. ఈ ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగుతుంది. అనంతరం గోవడ్ వద్దకు చేరి మహాపూజ, సంప్రదాయ పూజలు నిర్వహిస్తారు.

# మైకేల్ యార్క్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**తిర్యాణి:** ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేసిన మైకేల్ యార్క్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని గిన్నెదరిలో మైకేల్ యార్క్ 82వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేసిన మహనీయుడన్నారు. ఆదివాసీల జీవన స్థితిగతులపై డాక్యుమెంటరీ రూపొందించి బీబీసీ చానల్‌లో ప్రసారం చేయించాడన్నారు. కార్యక్రమంలో డీటీడీవో రమాదేవి, మాజీ ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, మాజీ జెడ్పీటీసీ వెడ్మ కమల, జీసీడీవో శంకుతల, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# గంగాపూర్ జాతర ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

**ఆసిఫాబాద్‌అర్బన్:** రెబ్బెన మండలంలోని గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 11 నుంచి 13 వరకు జరిగే జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతరకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, కమిటీ ప్రతినిధులు సమన్వయంతో కృషిచేసి జాతరను విజయవంతం చేయాలని సూచించారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు, సిబ్బంది, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

**విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలి**

**ఆసిఫాబాద్‌రూరల్:** వసతిగృహం విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను తనిఖీ చేసి తరగతి, వంటగదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

# విధులు బహిష్కరించిన ఆర్టీసీ టిమ్ డ్రైవర్లు



ఆర్టీసీ డిపో ఆవరణలో నిరసన తెలుపుతున్న టిమ్ డ్రైవర్లు

**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న టిమ్ డ్రైవర్లు సోమవారం ఉదయం విధులు బహిష్కరించి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సులకు 3 మస్టర్లు ఇవ్వాల్సి ఉండగా రెండే ఇస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారన్నారు. డ్రైవర్లు విధులు బహిష్కరించడంతో ఉదయం 5, 6, 7 గంటలకు వెళ్లాల్సిన సూపర్ లగ్జరీ బస్సులు నిలిచిపోయాయి. డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు డిపోకు చేరుకుని డీఎం విశ్వనాథ్‌తో మాట్లాడారు. సమస్యల పరిష్కారంకోసం తన వంతు కృషి చేస్తానని కార్మికులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఏఐవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి చిరంజీవి వారికి మద్దతు తెలిపారు.

**ఆర్టీసీపై అపోహలు వద్దు**

**ఆసిఫాబాద్:** ఎలక్ట్రిక్ బస్సుల రాకతో ఆర్టీసీ డిపోలను ప్రైవేటు చేస్తున్నారనే అపోహలు వద్దని డీఎం విశ్వనాథ్ అన్నారు. ప్రమాదరహిత మాసోత్సవాల సందర్భంగా సోమవారం డిపో ఆవరణలో ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వాస్తవ పరిస్థితులు వివరించారు. మూడేళ్లలో ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ప్రతీనెల ఒకటో తారీఖున జీతాలు అందజేసే స్థితికి సంస్థ వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇటీవల 3038 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చిందని, అందులో 2వేల మంది డ్రైవర్లు ఉన్నారన్నారు.

# దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

**ఆసిఫాబాద్:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో ఉపాధి కల్పించాలని జన్కాపూర్‌కు చెందిన ససోల గంగామణి, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కౌటాల మండలం ముత్యంపేటకు చెందిన ఇప్ప ధరణి, ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాలని కోరుతూ గుండి గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు బట్టుపెల్లి స్వప్న, తన భర్తపేరుతో ఉన్న పట్టా భూమిని తనపేరుతో మార్పు చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌కు చెందిన కుమరం కాసుబాయి, కాగజ్‌నగర్ మండలం రస్పల్లి గ్రామానికి చెందిన వార్ల వెంకటేశ్ తమ తల్లిదండ్రుల పేరుతో గల భూమిని విరాసత్ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

### రుణమాఫీ చేయాలి



నాకు కెరమెరి మండలం నాగాపూర్ శివారులోని సర్వే నంబర్ 35లో నాలుగెకరాల పట్టా భూమి ఉంది. పంటల సాగుకు బ్యాంకులో రూ.30 వేల రుణం తీసుకున్నా. రుణమాఫీ కోసం ఇప్పటి వరకు పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా. రుణమాఫీ అమలు చేయాలి.

– దుర్గం శంకర్, ఇందాపూర్, కెరమెరి

### వచ్చిన ఉద్యోగం రద్దు చేశారు..



నేను 8 నెలల గర్భిణిని. తెలంగాణ డీఎస్సీలో 1:1లో ఎంపికయ్యా. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆర్డర్ కాపీ తీసుకున్నా. నా ఆర్డర్ కాపీ రద్దు చేసినట్లు పోస్టులో పంపించారు. కొంతమంది కావాలని వచ్చిన ఆర్డర్‌కాపీని రద్దు చేస్తూ 13 ర్యాంక్ వచ్చిన వారికి ఉద్యోగం ఇచ్చారు. నాకు న్యాయం చేయాలి. – వకుడ్కర్ జ్యోత్స్న, కౌటాల

# కేసుల విచారణ త్వరగా పూర్తిచేయాలి

- ఎస్పీ డీవీ.శ్రీనివాస్‌రావ్



ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏఎస్సైలు

**ఆసిఫాబాద్‌అర్బన్:** పోక్సో, గ్రేవ్ కేసుల విచారణ త్వరగా పూర్తి చేయాలని ఎస్పీ డీవీ.శ్రీనివాస్‌రావ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ అధికారికి పూర్తి విచారణ, స్టేషన్ మేనేజ్‌మెంట్ తెలిసి ఉండాలన్నారు. అవసరమైతే న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీటీవీల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు వివరించాలన్నారు. గంజాయి, జూదం, పీడీఎస్ రవాణాలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఎస్‌హెచ్‌వోలకు నూతన క్రిమినల్ చట్టాలు అనే పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావ్, ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీలు కరుణాకర్, రామానుజం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**పదోన్నతి బాధ్యత పెంచుతుంది**

**ఆసిఫాబాద్‌అర్బన్:** ఉద్యోగ రీత్యా పదోన్నతి పొందితే విధుల్లో మరింత బాధ్యత పెరుగుతుందని ఎస్పీ డీవీ. శ్రీనివాస్‌రావ్ అన్నారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో హెడ్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తూ ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన బిజిమాన్ (ఆసిఫాబాద్ పీఎస్) మహేందర్‌పాల్ (రెబ్బెన పీఎస్), సంజీవ్ పాల్ (ఇస్గాం పీఎస్) సోమవారం ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## క్లుప్తంగా

### కలప పట్టివేత



పట్టుకున్న కలపతో రేంజ్ అధికారి

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్ పరిధి దండేపల్లి మండలం లింగాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను పట్టుకున్నట్లు రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుచ్చన్న ఇంట్లో సోమవారం తనిఖీ చేయగా కలపను లభించింది. స్వాధీనం చేసుకున్న కలపను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని రేంజ్ అధికారి తెలిపారు.

### బైక్‌ను ఢీకొన్న కారు

- ఒకరు మృతి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

సోన్: మండల కేంద్రంలోని ఐబీ వద్ద కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా మంజులాపూర్ గ్రామానికి చెందిన అంగాల పోతగౌడ్(63) సోమవారం గోదావరినది మాదాపూర్ ఘాట్‌కు స్నానం చేసేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఆర్మూర్ నుంచి నిర్మల్‌కు వస్తున్న కారు డ్రైవర్ మల్లికార్జున్ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రగాయాలైన పోతగౌడ్‌ను అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందాడని ఏఎస్సై షేక్ అహ్మద్ తెలిపారు. సీఐ నవీన్‌కుమార్ ఘటనస్థలాన్ని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

### ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

నర్సాపూర్(జి): మండలంలోని నందన్ ఎక్స్‌రోడ్ వద్ద ఆర్టీసీ బస్సును కారు ఢీకొంది. ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం.. సోమవారం భైంసా నుంచి ఆర్టీసీ బస్సు నిర్మల్ వెళ్తోంది. భైంసా నుంచి నిర్మల్ వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు కొంతమేర దెబ్బతింది. ఆర్టీసీ డ్రైవర్ లింగన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఒకరి రిమాండ్

బెజ్జూర్: రోడ్డు ప్రమాద కేసులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన దుబ్బుల నరేశ్ రోడ్డు ప్రమాద కేసులో కోర్టుకు హాజరుకానందున నాన్‌బెయిల్ వారెంట్ జారీ అయింది. సోమవారం నరేశ్‌ను అదుపులో తీసుకుని సిర్పూర్ కోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 14 రోజులపాటు రిమాండ్ విధించారని ఎస్సై పేర్కొన్నారు.



# ‘ఉపాధి’లో పొలంబాట

- ప్రతీ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు
- రైతుల పనులకు ప్రాధాన్యం
- మార్చినెలాఖరులోగా పూర్తికి కసరత్తు



కోటపల్లి మండలం బొప్పారంలోని పొలాలకు వెళ్లే బురద దారి

కోటపల్లి: జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకంలో రైతుల పొలాల్లోని బాటలను అభివృద్ధి చేసేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీంతో ఏళ్లుగా పొలాల్లో రాకపోకలకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తీరనున్నాయి. గతంలో నక్ష బాటలు, పూర్వకాలం నుంచి బండ్ల బాటలు ఉన్న ప్రాంతాల్లో రహదారులను బాగు చేయగా..తాజాగా రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. మార్చి నెలాఖరులోగా ఈ పనులు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తోంది. వీటిలో జలసంరక్షణ పనులతోపాటు రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఉన్న కాలినడక బాటలను బాగు చేసేందుకు చర్యలు చేపట్టారు.

**నిధులు కేటాయింపు**

రైతుల పొలాల మధ్య ఉన్న కాలిబాటలను దారులుగా మార్చేందుకు ఉపాధిహామీ పథకంలో కొంత మేర నిధులు కేటాయించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఆ నిధులతో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాలో రైతుల అంగీకారం మేరకు పనులు చేపట్టనున్నారు.

**రైతులకు ఉపయోగపడేలా..**

రైతులకు ఉపయోగపడేలా పశువుల షెడ్లు, అజోల్లా పెంపకం, వర్మీ కంపోస్టు తయారీ పనులు జలనిధి ద్వారా చెక్‌డ్యాం నిర్మాణం, ఇంకుడుగుంతలు, వ్యవసాయబావులు, వర్షం నీటిని ఒడిసిపట్టే నిర్మాణాలు చేపట్టనున్నారు. పొలాల బాటల అభివృద్ధి కోసం ప్రతీ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు వెచ్చించనున్నారు. తమ ఆవాసాల నుంచి పొలాలకు చేరేందుకు రైతులు సరైన రోడ్లు లేక ఒడ్లు, గట్ల మధ్య నడిచి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు, బోరు మోటార్లు, పైపులు తదితర సామగ్రిని మోసుకెళ్లేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో వారి కష్టాలు వర్ణనాతీతం. ప్రభుత్వం పొలాలకు బాటాలు బాగు చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించడంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లా వివరాలు..

| జిల్లా | మండలం | పంచాయతీలు | జాబ్‌కార్డులు | కూలీలు |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 17 | 468 | 1,75,747 | 3,70,082 |
| కుమురంభీం | 15 | 335 | 1,29,885 | 2,77,287 |
| నిర్మల్ | 18 | 396 | 1,80,572 | 3,70,550 |
| మంచిర్యాల | 16 | 311 | 1,21,067 | 2,55,151 |

**సద్వినియోగం చేసుకోవాలి**

ప్రభుత్వ నిర్ణయంతో పొలాలకు కాలిబాటల్లో వెళ్లే రైతుల ఇబ్బందులు తీరుతాయి. పొలాల మధ్య నుంచి తమ బావుల వద్దకు వెళ్లే రైతుల అంగీకారంతో పనులు చేపడుతాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– కిషన్, డీఆర్‌డీవో, మంచిర్యాల జిల్లా

రావిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు



# జంగుబాయికి మొక్కు

- తరలివచ్చిన భక్తులు
- నేడు కేస్లాపూర్‌కు అమ్మవారు
- ముగియనున్న ఉత్సవాలు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని మహారాజ్‌గూడ సమీపంలో ఈనెల 1 నుంచి ప్రారంభమైన జంగుబాయి ఉత్సవాలు ముగియనున్నాయి. బుధవారం నుంచి ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో నాగోబా పూజ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి జంగుబాయి అమ్మవారు కేస్లాపూర్‌కు చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి. ముగింపు సందర్భంగా సోమవారం ఉమ్మడి జిల్లాతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి జంగుబాయిని దర్శించుకుని పూజలు చేశారు. మొక్కు చెల్లించుకున్నారు. సుమారు 316 మేళంలు అమ్మవారిని దర్శించుకున్నాయి. ఇప్పటివరకు 2.10 లక్షల మందికి పైగా దర్శించుకున్నట్లు ఆలయ కమిటీసభ్యులు శ్యాంరావు, మరప బాజీరావు తెలిపారు.

**నేడు దేవతల విగ్రహాల శుద్ధీకరణ**

మంగళవారం సాయంత్రం కపిలయి, సిద్ధికస, దారికస, విజ్ఞకస, టొప్లకస ప్రాంతాల్లో గల పవిత్ర నదుల్లో నుంచి గంగాజలాన్ని తీసువచ్చి దేవతా విగ్రహాలను శుద్ధిచేస్తారు. తర్వాత నాగోబా పూజకు అమ్మవారు వెళ్లనుండడంతో అదే రోజు చివరిగా కటోడాలు ఖరారు చేశారు. దేవతల శుద్ధితో జంగుబాయి ఉత్సవాలు ముగుస్తాయి.



మైసమ్మకు పూజలు చేస్తున్నభక్తులు



భేటింగ్ అవుతున్న మహిళలు

# ‘కాంగ్రెస్ పాలన మాకొద్దు’



నిరసన తెలుపుతున్న ముఖరా(కే) గ్రామస్తులు

ఇచ్చోడ: కాంగ్రెస్ పాలన మాకొద్దంటూ మండలంలోని ముఖరా(కే) గ్రామంలో సోమవారం గ్రామస్తులు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి మాట్లాడుతూ గణతంత్ర వేడుకల సందర్భంగా అర్హులందరికీ రేషన్‌కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మండలానికి ఒక్క గ్రామాన్ని ఎంపిక చేసి మిగతావారికి మొండిచెయ్యి చూపిందని ఆరోపించారు. వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 13 నెలల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు తిరుపతి, విఠల్, దత్తు, అశోక్ పాల్గొన్నారు.

# షార్ట్‌సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధమైంది. వివరాల ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గోల్కొండ పోచమల్లు సోమవారం ఉదయం వ్యవసాయ పనులకు కుటుంబంతో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగి రేకుల ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తులు అందించిన సమాచారంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఆర్ఐ భానుచందర్, పంచాయతీ కార్యదర్శి లావణ్య సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పంచనామా నిర్వహించారు. ప్రమాదంలో స్టడీ సర్టిఫికెట్లు, రూ.లక్ష నగదు, 2 తులాల బంగారంతోపాటు ఇంటి సామిగ్రి, 4 క్వింటాళ్ల బియ్యం, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.6 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఫైర్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. బాధితుడికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తామన్నారు.

**రాంనగర్‌లోని ఇంట్లో..**

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని రాంనగర్‌కాలనీలో సాయికిరణ్ ఇంట్లో సోమవారం షార్ట్ సర్క్యూట్ జరిగింది. మావల వైపు నుంచి ఆదిలాబాద్ వస్తున్న ఎస్పీ గౌస్ ఆలం గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందజేశారు. మంటలార్పే వరకు అక్కడే ఉన్నారు. ఇంట్లో కూలర్ వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగిందని ఫైర్ అధికారులు గుర్తించారు. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని కాలనీవాసులు తెలిపారు. డీఎస్పీ జీవన్ రెడ్డి, మావల ఎస్సై విష్ణువర్ధన్ ఉన్నారు.

**కిరాణాషాపులో అగ్నిప్రమాదం**

చింతలమానెపల్లి: మండలంలోని కోయపెల్లి గ్రామంలో కిరాణాషాపు సోమవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో తినుబండారాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సామగ్రి కాలిపోయాయి. స్థానికులు నీటి చల్లడంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అధికారులు తనను ఆదుకోవాలని బాధితుడు కుమురం కనకయ్య కోరాడు.

**ప్రమాదవశాత్తు స్కూటీ..**

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలో స్కూటీ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన అంకన్న సోమవారం సాయంత్రం స్కూటీపై బూర్గుడ గ్రామానికి వెళ్తున్నాడు. జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్ వద్ద స్కూటీ నుంచి శబ్దం రావడంతో ఆపి చూసేసరికి బ్యాటరీ నుంచి మంటలు వ్యాపించి దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. దివ్యాంగుడైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని అంకన్న వేడుకున్నాడు.

### జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎల్లక్కపేటలోని ఆది శంకరాచార్య జిన్నింగ్ మిల్లులో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. మిల్లు ఆవరణలో నిల్వ ఉంచిన పత్తి కుప్పలో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన సిబ్బంది వెంటనే చెన్నూర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మరో ఫైరింజన్ తెప్పించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంపై మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులును వివరణ కోరగా, మంటలు ఎలా అంటుకున్నాయో సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని, కాలిన పత్తి, నష్టం వివరాలను అంచనా వేసి వెల్లడిస్తామన్నారు.

### పెరటిలో గంజాయి పెంపకం



పెరటిలో పెంచిన గంజాయి మొక్క

వేమనపల్లి: రైతు తన పెరటిలో రెండు గంజాయి మొక్కలు పెంచి పోలీసులకు దొరికిపోయాడు. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ కథనం ప్రకారం.. వేమనపల్లికి చెందిన రైతు తెల్ల నారాయణ తన ఇంటి వెనుకాల ఉన్న పెరటిలో రెండు గంజాయి మొక్కలు నాటాడు. నిత్యం గంజాయి సేవిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై సోమవారం ఆయన ఇంటికి వెళ్లి తనిఖీ చేశారు. నారాయణ వద్ద ఉన్న 584 గ్రాముల ఎండు గంజాయితోపాటు ఒక చెట్టును స్వాధీనం చేసుకున్నారు. పక్వానికి వచ్చిన చెట్టును పీకి వేసి లుంగీలో మూటగట్టి గడ్డివాములో దాచి ఉంచినట్లు తెలిపారు. గంజాయి మొక్కగా ఏవో వీరన్న గుర్తించారు. దీని విలువ రూ.10 వేలు, ఎండు గంజాయి రూ.14,600 ఉంటుందని ఎస్సై తెలిపారు. నారాయణను అదుపులో తీసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

### 356 కిలోల గంజాయి ధ్వంసం



పట్టుకున్న గంజాయితో ఎక్సైజ్ సిబ్బంది

ఇచ్చోడ: వివిధ కేసుల్లో పట్టుకున్న 356 కిలోల గంజాయిని ధ్వంసం చేసినట్లు ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి వద్ద గల మెడికేర్ సర్వీస్ సెంటర్‌కు గంజాయిని తరలించి అక్కడి ఎలక్ట్రికల్ యంత్రంతో సోమవారం ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

### తుపాకీతో బెదిరించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

మంచిర్యాలక్రైం: తుపాకీతో చంపుతానని బెదిరించిన వ్యక్తికి మూడేళ్ల సాధారణ జైలుశిక్ష తోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె.నిరోష సోమవారం తీర్పునిచ్చింది. సీఐ ప్రమోద్‌రావు కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన వినోద్ మహార్ పానీపూరి బండి నిర్వహిస్తున్నాడు. అతని వద్ద మధ్యప్రదేశ్‌కు చెందిన గ్యాప్రసాద్ అలియాస్ రాజు కొంతకాలం పనిచేసి మానేశాడు. 2016 నవంబర్ 12న ఇద్దరి మధ్య లావాదేవీల విషయంలో గొడవపడ్డారు. రాజు తుపాకీతో చంపుతానని బెదిరించడంతో వినోద్‌మహార్ అదేనెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ డి.సుధాకర్ కేసు దర్యాప్తు చేపట్టి రాజును రిమాండ్‌కు తరలించి తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.రవీందర్ సాక్షులను విచారించి నేరం రుజువు చేశారు. నిందితుడు రాజుకు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చింది.

### చుక్కల దుప్పిని చంపిన కేసులో ఇద్దరికి బెయిల్

చెన్నూర్‌రూరల్: చుక్కల దుప్పిని చంపిన కేసులో ఇద్దరికి సొంత పూచీకత్తుపై బెయిల్ మంజూరైంది. ఎఫ్ఆర్వో శివకుమార్ కథనం ప్రకారం..మండలంలోని శివలింగాపూర్‌కు చెందిన బోయప్రసాద్, నక్క మహేందర్, ఊరటి పోచంలు గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చి చుక్కల దుప్పిని హతమార్చారు. ఈనెల 24న రాత్రి సమయంలో నక్క మహేందర్ ఇంట్లో దుప్పిని కోసి పోగులు వేస్తుండగా అటవీ అధికారులు దాడి చేసి ప్రసాద్, మహేందర్‌లను పట్టుకున్నారు. పోచం పరారీలో ఉన్నాడు. పట్టుకున్న ఇద్దరిని సోమవారం మంచిర్యాల కోర్టులో హాజరుపర్చగా సొంత పూచీకత్తుపై బెయిల్ మంజూరైంది. డిప్యూటి రేంజ్ అధికారి ప్రభాకర్, బీట్ అధికారి స్వప్న, సెక్షన్ అధికారులు రాజేష్, చంద్రమోహన్, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

### వ్యక్తి అదృశ్యం



గంధం సంతోష్

నిర్మల్‌టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక గాంధీనగర్ కాలనీకి చెందిన గంధం సంతోష్ ఈనెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే సెల్ 87126 59511, 87126 59512 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

# ఖందేవుని ఆలయంలో ఎంపీ పూజలు



బేలలో మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్



నార్నూర్: పూజలు చేస్తున్న ఎంపీ గోడం నగేశ్

నార్నూర్: మండల కేంద్రంలోని తొడసం వంశీయుల ఆరాధ్యదైవం ఖందేవుని ఆలయంలో ఎంపీ గోడం నగేశ్ సోమవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఖందేవ్ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. మహాపూజ కోసం తరలివచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు భీక్షపతి రాథోడ్, ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావు, బీజేపీ బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జ్ఞానోబా పుస్కర్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చాల్కుర్ ప్రకాశ్, నాయకుడు మాడవి చంద్రహరి తదితరులు ఉన్నారు.

**ఆలయాల అభివృద్ధికి కృషి**

బేల: సదల్‌పూర్ మహాదేవ్, భైరందేవ్ ఆలయాల అభివృద్ధి కృషి చేస్తానని ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. సోమవారం జంగీ జాతర పురస్కరించుకొని మండలంలోని సదల్‌పూర్ మహాదేవ్, భైరందేవ్ ఆలయాలను సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఆదివాసీ దర్బార్ సభలో ఆయన మాట్లాడుతూ పుష్యమాసం ఆదివాసీలకు చాలా పవిత్రమని, నెలరోజులు భక్తిశ్రద్ధలతో కుల దైవాలను పూజిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ సమన్వయంతో ఆలయాల అభివృద్ధికి చొరవ తీసుకుంటామన్నారు. కాగా ఆలయాలకు ప్రహరీ, ఒక బోరు సౌకర్యం, సదల్‌పూర్ నుంచి ఆలయాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణంతోపాటు ఆలయాల ఆధునికీకరణ కోసం ఆలయ కమిటీ సభ్యులు ఎంపీకి వినతిపత్రం అందించారు. బీజేపీ నాయకులు పాయల్ శరత్, దత్తా నిక్కమ్, ఇంద్రశేఖర్, రాందాస్, దేవ్‌రావు, మోరేశ్వర్, గణేశ్, ఆలయ కమిటీ సభ్యులు శ్యాంరావు, కుషాల్‌రావు, సోనేరావు ఉన్నారు.

# మళ్లీ చదువుకునే అవకాశం

- మధ్యలో మానేసిన వారికి, ఓపెన్ స్కూల్ ద్వారా
- నేడు, రేపు తత్కాల్ ప్రవేశాలు



దండేపల్లిలో ఓపెన్ తరగతుల బోధన

దండేపల్లి: వివిధ కారణాలతో చదువుకు దూరమైన వారు మళ్లీ చదువుకునేందుకు తెలంగాణ సార్వత్రిక పీఠం(ఓపెన్ స్కూల్ సొసైటీ) అవకాశాన్ని కల్పిస్తోంది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల ప్రక్రియ ఇదివరకే పూర్తయినప్పటికీ, ఈనెల 27 నుంచి 29 వరకు తత్కాల్ విధానంలో ప్రవేశాలకు మరో అవకాశం కల్పించింది. టెన్త్, ఇంటర్ చదువుకోవాలనేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**సెలవురోజుల్లో తరగతులు..**

పదో తరగతికి 14, ఇంటర్మీడియెట్ ప్రవేశానికి 15 ఏళ్లు నిండి ఉండాలి. బడి మధ్యలో మానేసినవారు పది, పదో తరగతి పూర్తయిన వారు ఇంటర్ చదవొచ్చు. సరళమైన విద్యావిధానం, సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తారు. మహిళలు, పలు వృత్తి, వ్యాపారాల్లో ఉన్నవారు, ప్రజాప్రతినిధులు, సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన వారికి సదావకాశం. స్వీయ అభ్యసన సామగ్రి అందజేస్తారు. యూట్యూబ్ ఛానల్, వెబ్‌సైట్ ద్వారా పాఠ్యాంశాలు నేర్చుకోవచ్చు. ఒకసారి ప్రవేశం పొందినప్పటి నుంచి 5 ఏళ్లు లేదా 9 పర్యాయాలు పబ్లిక్ పరీక్షలు రాయొచ్చు. ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల ద్వారా ఈనెల 29 లోగా దరఖాస్తు ఫీజు చెల్లించవచ్చు.

ఉమ్మడి జిల్లాలో ఓపెన్ అధ్యయన కేంద్రాలు..

| జిల్లా | కేంద్రాలు | (టెన్త్, ఇంటర్)లో ఇప్పటివరకు ప్రవేశాలు |
|---|---|---|
| ఆదిలాబాద్ | 11 | 890 |
| కుమురంభీం | 10 | 485 |
| మంచిర్యాల | 13 | 1370 |
| నిర్మల్ | 14 | 1077 |

**దరఖాస్తు చేసుకోవాలి**

వివిధ కారణాలతో చదువు మానేసి, మళ్లీ చదువుకోవాలనుకునే వారికి ఓపెన్ స్కూల్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. తత్కాల్ ప్రవేశాలకు రెండు రోజులు అవకాశం ఉన్నందున ఆసక్తి ఉన్నవారు ఎవరైనే ఉంటే దరఖాస్తు చేసుకోవాలి.
– అశోక్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్

# ట్రిపుల్‌ఐటీలో ప్రొఫెసర్ల నిరసన



బాసర ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు సోమవారం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తంచేశారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అధ్యక్షుడు ఉపేందర్ మాట్లాడుతూ 15 ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నామని తెలిపారు. 77 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారన్నారు. ఏళ్లుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. చాలీచాలని జీతాలతో జీవనం కొనసాగిస్తున్నామన్నారు. ట్రిపుల్‌ఐటీ భాగస్వాములమైన తమకు యూజీసీ పేస్కేల్‌తో కూడిన గౌరవ వేతనం అందించాలని డిమాండ్ చేశారు. బేసిక్, డీఏ, హెచ్‌ఆర్‌ఏతోపాటు మూడు శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.